ఇక్కడ హర్షశోకాల ఋతువుల రతిలో పూచి
వాడిపోయే దివారాత్రులు
వైభవాల గాజు పెంకుల గుట్టలపై పారేసిన
పాటల రిక్త పాత్రలు
కాదు కాదు. ఇవి కాదు నాకొరకు-ఏదో ఒక
సంపూర్ణత
సమగ్రసమీచీనత. వివరాల అంగాంగాల
అణువులోంచి
మూలకందపు ఆత్మలోకి రేణుకణంనుంచి మేరు
నగంవరకు
సంక్షుబ్ధ సాగర ఘోషనుంచి మూగ జీవాల
భాషవరకు
అన్నిటికీ ఒక లయ ఒక తాళం ఒకే పర్వంలో
మేళవించి నాలో
లోకంకొరకై లోకంలో నాకొరకై ఏకైక
మహోద్రేకం ఉరికించాలని కోరిక
కాని కడకు దేవుడు లేని పాడుబడిన గుడిమాత్రం
మిగులుతోంది
వివరాల్లో విషయాన్నీ, విషయంలో వివ
రాల్నీ మరచిపోడం జరుగుతోంది

ప్రతిక్షణం మంచుకురిసి చెరుపుతున్నది గడచిన
అడుగుజాడలు
ప్రతి పగటి వెలుగు వెల్లువ గడచిన రోజుల
నీడలు
ఎక్కడ మొదలెట్టడమో? ఎక్కడ తుది ముట్ట
డమో?
ఈ విరిగిన పనిముట్టులతో ఏమిటి చెక్కడమో?
పులుగు గొంతుక మూగబోయిన వేళ, తరంగ
స్వరభంగాలు
నిశ్శబ్దపు తీరాన్ని తాకి జాలిగా తిరిగిపోయే
వేళ
పువ్వుల చెవుల్లో గుసగుసల మంచుబొట్లు
చల్లగా కరిగిపోయే వేళ
కంఠం ఒక కంఠం కావాలి నాకు.
అనేక కంఠాల మంటల ఘంటగా పలకగల ఒక
కంఠం
కంఠం, ఒక కంఠం, మానవ గీత ఆలపించేందు
కొక కంఠం!

(సమాప్తము)

# వేదాంతురాలు భార్య

అవసరాల రామకృష్ణరావు

'నిజంగా ఆలోచిస్తే మామిడిపండుకున్న రుచి దేనికుంది? ముందా బ్రహ్మ మూడు కాలాలంటూ ఏడిశాడు గాని, అంతా వేసంగే అయితే నిత్యం యీపళ్లు పండే కదా! అర ముగ్గిన బంగినపల్లి పండు తొక్కతీసి చిన్న చిన్న ముక్కలు తరిగి ముందుపడేస్తే అన్నీ పరిత్యజించిన మహాముని లాంటివాడికే 'తిననా, మాననా?' అని లోపల ద్వంద్వయుద్ధం జరిగి పోతుందే, నాలాంటివాడు జిహ్వ కట్టుకోలేక మహానదిలా లాలాజలం కార్చాడంటే తప్పేముంది?'

గోవర్ధనానికి ఆనందం సముద్రంలా గంతు లేస్తోంది. మామిడిపళ్లు మహాఖరీదైన ఈ రోజుల్లో ఆపార్టీ వెర్రి సన్నాసి పద్దెంటున్నా మూడు పాతికలు బంగినపల్లి పళ్ళు తెచ్చి అక్కడ పెట్టేశాడు. మంచి రాతలో ఉన్నాడు కాని లేకపోతే గోవర్ధనం అప్పుడే అందులో కనీసం అరపాతికైనా ఆహుతి చేసి ఉండును! 'ఇంటిగ్గిర మా ఆడవాళ్లుంటారు యిచ్చిరండి' అని పంపించాడు— ఈపాటికి ఆవిడ తరిగి ముక్కలుకోసి ఉంచుతుందేమో!

వెధవది మామిడిపండు మొహామేనా ఎర గడా, అంత ఆనందం దేనికంటారేమో, పేరుకు ప్లీడరేగాని గోవర్ధనానికి, అనకూడదు గాని, దఫేదారు వెంకయ్యపాటి కీర్తయినా లేదు! ఇతనికి ధనరూపేణా ఫీజా ముట్టదు. ఏదో వస్తు రూపేణా రెండు ఓప్పుళ్లనీ, అరటిపళ్లె పుచ్చు వంకాయలనీ యిలా ముడుతూ ఉంటుంది.

అలాంటిది మామిడిపళ్లు, అందులో బంగినపల్లి, అందులో ఒకటా రెండా మూడు పాతికలాయెను- అతను పొంగి బోర్లాపడ్డాడంటే అతని తప్పా చెప్పండి! ఇంత ఆనందంగా ఉన్న మొహం భార్య తులశమ్మను చూడగానే పిడిచిన వంకాయలా నల్లబడిపోయింది. కారణం? మామిడిపళ్ళు కంటబడక పోవడమే! తులశమ్మ దగ్గిర కాస్త భయం ఉందిగాని లేకపోతే యీ పాటికి పచ్చడిచేసి ఉండేవాడే. తను తొందరపడ్డాడుగాని ఒహవేళ దాచిందేమో!

'ఏమే, మామిడిపళ్లేవీ?'

'ఏవా? లెఖ్ఖ చెప్పనా?'

లెఖ్ఖేమిటి నీ మొహం, ఉన్నట్టా, లేనట్టా?'

మీరు మూడు పాతికలు మామిడిపళ్లు పంపించారా, అన్నీ ఆరముగ్గి ఆరగించడానికి సిద్ధంగా ఉన్నాయి. ఉన్నవాళ్లం ముగ్గురం- పళ్లు కుళ్ళిపోడం తప్ప అన్నీ తినగలమా అని పాతిక పళ్ళు మీ చెల్లెలికి పంపించాను.'

'అయితే?' అన్నాడు గోవర్ధనం.

'మీరలా కళ్లెఱ్ఱజేశారంటే మాట దక్కదు- కాస్త ఆ గుడ్ల ఎఱుపు తమాయించుకు మరీ అడగండి.'

'అబ్బ చెప్పవే?'

'ఊరికే పోతాయికదా అని మీ చెల్లెలికే పంపేను. ఇందులో నేను ఉరెట్టుకున్నదేం లేదు.'

'సరే లేవే చెప్పు.'

''మన రాముడిచేత ఆ పాతికా పంపించాను. వాడు పళ్లిచ్చేవేళకి మా అక్కయ్యగారు తను అక్కడే వుండిట, దానికి యియ్యకపోతే బాగుంటుందా. ఓ యిరవై పళ్లు దాని చేతిలో పెట్టేరు. అక్కణ్ణించి యిక్కడికీ, యిక్కణ్ణించి అక్కడికీ తెగమోశాడు ఆ రాముడు చేతిలో ఓ అయిదు పళ్ళైనా పెట్టకపోతే బాగుంటుందా చెప్పండి?' 'పోనీలే, తక్కిన పాతికా ఏవీ?'

'కూర్చున్నారా ఏమిటి?' 'రాముడికే యిచ్చారు, నాకివ్వరా ఏమిట'ని అప్పి చక్కా వచ్చింది. దాని కళ్ళు పడిపోతే దుక్కలాంటి వాళ్లుకుండా చిక్కి శల్యమౌతారు, పెట్టక తప్పుతుందా? ఓ నాలుగు దాని చేతిలో పెట్టేను- నేను పురిస్త్రీకి పళ్లిచ్చుకోనిదే ఎంగిలి పడనని మీకు తెలిసిన విషయమేకదా, సుభద్రమ్మగార్ని పిలిపించి పదిపళ్లు యిచ్చుకున్నాను - కూడా ఆవిడ పిల్లవచ్చి ఏడుస్తే ఒకపండియ్యక తప్పింది కాదు.'

పోనీలే ఏంచేస్తాం, మిగిలిన పదినాలు చాలు యిలాతే'

'అయ్యో మీ అల్పసంతోషం కూల. యింకా ఉన్నాయనుకున్నారుటండీ మీ భ్రమ అలాపీడిస్తోంది! గాని!' 'అయితే ఏమయినట్టు'

'ఇందరూ తింటూంటే యింట్లో ఉన్న కుర్రవెధవ ఊరుకుంటాడు గనుకనా? వాడికి ఎందులో మీపోలిక రాకపోయినా 'ఏవ' లోనూ వాపిరిగొట్టుతనంలోనూ అచ్చంగా మీ మూర్తే! అలమారు పైసొరుగులో దాచాను సుమండీ. ఎలా పసిగట్టేడో పీడి అఘ్రాణశక్తి మండ! మళ్లీ చూసేసరికి ఆరుపళ్లు లేవు! మూడు పీకు తిని మూడు వాళ్ల బేబీకి పెట్టేడుట- కుర్రాడి తెల్లని బుగ్గ ఖరాబు చెయ్యడం గాని కొట్టేం లాభం చెప్పండి? ఇక మిగిలినవి చిన్నవీ, మిగల పండినవీ పాడయినవీను! అలాంటి పళ్లు మీ చేతిలో చూసిచూసి పెట్టడానికి నా మనస్సొప్పక, కొంత జిహ్వాపీకుడు కూడా లేకపో లేదనుకోండి (మీ అర్ధాంగి నయిన తరువాత ఆ మాత్రం వాపు ఉండకపోతుందా) ఆ నాలుగూ నోట్లో పడేసుకున్నాను— నే చేసిందాంట్లో తప్పేమయినా ఉంటే తగు పెద్దమనుషుల్ని పిలిచినా సరే, మీరు చేయి జేసుకున్నా సరే, ఏం? అలా నిలువుగుడ్లు పడిపోయిందేం?- వెధవ మామిడిపళ్లు, దేనిమీదేనా అంత ప్రీతి పెట్టుకో కూడదు, ఏది శాశ్వతం చెప్పండి! ఇప్పుడున్న మనిషి యింకో గడియకే కనిపించడం లేదే. వెధవ మామిడిపండు నిలబడుతుందా చెప్పండి?'